తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | శనివారం | 27 - 06 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజీలు : 1

# వరి వద్దు –ఆరుతడి పంటలు ముద్దు



ఎం.అశోక్ కుమార్
వ్యవసాయ విస్తరణ అధికారి
ఆత్మకూర్ (ఎం) మండలం
యాదాద్రి జిల్లా

## ఎల్‌నినో ప్రభావం-రైతులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజావారధి/మోత్కూరు**
ప్రస్తుతం తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం అసమానంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందడమే కాక పొడి విరామలు ఉండే అవకాశం ఉంది. ఈ అసమాన వర్షపాతాలను దృష్టిలో ఉంచుకొని  సాగులో స్వల్ప, మధ్యస్థ రకాలను సాగు చేయడం  ద్వారా కరువు పరిస్థితుల నుండి కొంత వరకు రైతులు ఉపశమనం పొందే అవకాశం ఉంది. అలాగే సాగుకు అధిక వినియోగం అవసరమయ్యే హైబ్రిడ్ రకాల సాగుకంటే తక్కువ నీటి వినియోగం అవసరమయ్యే సూటి రకాలు ఎంపిక చేసుకోవడం ఉత్తమం. వరి సాగుచేసే రైతులు ప్రస్తుతం 50 శాతం వరి పంట విస్తీర్ణంలో ఆరుతడి పంటలైన కంది, పెసర, మినుములు, జొన్నలు, నువ్వులు, చిరుధాన్యాలు సాగు చేయడం మంచిది. అందులో అంతర పంటలుగా కంది-పెసర, కంది-మినుములు సాగుచేస్తే రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చు.

### హైబ్రిడ్ రకాల కంటే సన్న వరి రకాలే మేలు

తప్పని పరిస్థితుల్లో వరి సాగు చేసే రైతులు హైబ్రిడ్ రకాలకు బదులుగా సూటి రకాలు సాగు చేసుకోవాలి. సూటి రకాల్లో స్వల్ప , మధ్యకాలిక(120-135 రోజుల) వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలి. వరి  రైతులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంపిక చేసిన 8 వరి సన్నాలకు  క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. దీనివల్ల రైతులకు కనీస మద్దతు ధరతో పాటు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంది. కావున రైతులు సన్నాల సాగు చేయడం ఎంతో ముఖ్యం.

### సాగుకు అనువైన వరి సన్నరకాలు

సాగుకు అనుకూలమైన స్వల్పకాలిక మరియు అధిక దిగుబడినిచ్చే సన్న రకాల్లో ఆర్ఎన్ఆర్-5048(తెలంగాణ సోనా), కెఎన్ఎం-1638(కూనారం వరి-2), జేజీఎల్-1798(జగిత్యాల సన్నాలు),



డబ్ల్యూజీఎల్-962(వరంగల్ వరి-2) ప్రధానమైనవి. ఈ రకాలు తక్కువ వ్యవధిలో పంట పూర్తిచేసి నీటి వినియోగాన్ని తగ్గించడంలో కూడా సహాయపడతాయి.

### పంట మార్పిడి ఎందుకు అవసరం..?

వాతావరణ మార్పులు, నీటి కొరత మరియు సాగు వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు పూర్తిగా వరిపైనే ఆధారపడకుండా పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలి. వరుసగా వరి సాగు చేయడం వల్ల భూసారం తగ్గడం, తెగుళ్ల ఉధృతి పెరగడం మరియు నీటి వినియోగం అధికమవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. కావున రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి సాగులో ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కావున వరి విస్తీర్ణంలో కొంత భాగాన్ని పప్పుధాన్యాల పంట అయిన కందిని సాగుచేయడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

### కంది సాగు-నీటి పొదుపుకు, ఆదాయ భద్రతకు మార్గం

పంట మార్పిడి కింద కంది పంట ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. కంది పంటకు తక్కువ నీరు అవసరం కావడం, వర్షాభావ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం ఉండటం, భూమిలో నత్రజని స్థిరీకరణ ద్వారా భూసారాన్ని పెంచడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే పప్పుధాన్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కందికి మార్కెట్లో మంచి ధర లభించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం క్వింటాల్‌కి రూ.8450 కనీస మద్దతు ధర కల్పించింది. వానాకాలంలో జూన్ రెండవ పక్షం నుండి జూలై చివరి వారం వరకు కంది విత్తుకోవడం అనుకూలమైన సమయం. సరైన సమయంలో విత్తడం ద్వారా మొలక శాతం పెరిగి మంచి దిగుబడులు పొందవచ్చు.

### అనుకూల కంది రకాలు

తెలంగాణ పరిస్థితులకు అనువైన కంది రకాల్లో డబ్లూఆర్‌జీఈ-97(వరంగల్ కంది), పీఆర్‌జీ-176(ఉజ్వల), ఐసీపీఎల్-87119 (ఆశా) ప్రధానమైనవి. అలాగే ఎన్.టి.ఎల్-30 (దుర్గా) అనే హైబ్రిడ్ కంది రకం కూడా అధిక దిగుబడుల సామర్థ్యం కలిగి రైతులలో బాగా ప్రాచుర్యం పొందినది.

### ముగింపు

ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయ పద్ధతుల్లో పంటల ప్రణాళిక రూపొందించుకోవాలి. హైబ్రిడ్ రకాల కంటే ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అదనపు బోనస్‌తో పాటు మంచి ఆదాయం పొందవచ్చు. అదే సమయంలో పంట మార్పిడి కింద కంది వంటి పప్పుధాన్యాల సాగు చేపట్టడం ద్వారా నీటి పొదుపు, భూసార పరిరక్షణ మరియు స్థిరమైన ఆదాయం సాధ్యమవుతుంది. వాతావరణ మార్పులను సవాళ్లుగా కాకుండా అవకాశాలుగా మలుచుకుంటూ, నీటి వినియోగాన్ని తగ్గించే పంటలను ఎంచుకోవడం నేటి అవసరం. రైతులు తమ సమీప వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకుని లాభదాయక వ్యవసాయాన్ని సాధించాలి.